



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -14-

*" ఏ సమాజంలో అయితే, స్త్రీలు, పురుషులకు దాస్యం చేయ్యరో, ఏ సమాజం లో అయితే పురుషాహంకారం సంపూర్ణంగా నశిస్తుందో, ఏ సమాజంలో అయితే స్త్రీ, పురుషులు సమానులుగా జీవిస్తారో, ఏ సమాజంలో అయితే, విద్య నిజమైన విజ్ఞానాన్ని ఇస్తుందో, ఏ సమాజంలో అయితే మనుషుల మధ్య కపటత్వం లేని స్నేహ సంబంధాలు ఏర్పడతాయో, ఆ సమాజానికీ, ఆ సమాజ నిర్మాణానికీ తోడ్పటేటట్లుగా చలం గారి రచనలు నిలుస్తాయి. ప్రపంచ జనాభాలో సగ భాగమైన స్త్రీల శ్రేయస్సూ అభ్యుదయాన్నీ చిత్తశుద్ధితో కూడిన ప్రజా రచయిత, సమాజ మిత్రుడు చలం* " ఈ వాక్యాలు రాసింది 1979 ప్రజాసాహితి అనే మాసపత్రికకు ఆనాడు ఆ పత్రికకు సంపాదకత్వం వహించిన రంగనాయకమ్మ గారు.

తాను సృష్టించిన సాహిత్యం, అది కదిలించిన ప్రభావం, తద్వారా తనను అభిమానించిన అశేష పాఠకజనం– ఇలాంటి విషయాల కంటే కూడా, తను ఎదుర్కొంటున్న సంఘటనలు, తను నమ్మి చేసిన పనుల వల్ల సమాజపు

ఆగ్రహానికి గురైన సంఘటనల గురించి ఎక్కువగా చెప్పుకున్న, విలక్షణ వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న రచయిత చలం. ... గుడిపాటి వెంకట చలం!!

1950 ఫిబ్రవరిలో విజయవాడ నుంచి బయలుదేరిన చలంగారు ఆ మర్నాడు రాత్రికి అరుణాచలం చేరుకున్నారు. ఆయనతో పాటు పెద్దమ్మాయి సౌరీస్, మూడవ అమ్మాయి పకపక, పెంచుకున్న అమ్మాయి చిత్రా, నర్తకీ, అలాగే చిత్ర సంతానం నెలల పాప "డాలీ"వున్నారు. చలం గారి రెండో అమ్మాయి 'చే' అంటే, నిర్మల, అంతకు ముందే వుద్యోగం చూసుకోవడానికి మద్రాస్ వెళ్లిపోయారు. ఇక చలంగారి భార్య రంగనాయకమ్మగారు కొద్ది రోజులు బెజవాడలో వుండి "ఏవో పనులు చక్క బెట్టుకొని వస్తా"నని ఉండిపోయారు. అలా మొదలయ్యింది చలం గారి అరుణాచలంలోని ప్రస్థానం.

వెంటనే ఎక్కడ ఉండాలి? అరుణాచలంలో చలం గారినీ, అతని పరివారాన్ని పూలదండలు వేసి ఆహ్వానించడానికీ, వాళ్లకు అన్ని సౌకర్యాలూ కల్పించడానికి ఎవ్వరూ ఎదురు రాలేదు. అసలు వాళ్ళకంటూ ఎవరూ లేరు. అప్పటికి 5 సంవత్సరాలుగా అంటే 1945 నుండి రమణాశ్రమానికి దూరంగా ఒక కుటీరం లాంటి పూరి పాకలో రంగనాయకమ్మగారు వుంటున్నారు. ఆ పూరిపాకలోనే దిగారు చలంగారూ, పిల్లలూ. ఇంత మందిని వెంట బెట్టుకొని, బళ్ల మీద సామాన్లు వేసుకొని వచ్చిన చలం గారిని చూసి ఆశ్రమం లోని వాళ్ళందరూ నవ్వుకున్నారు.

అప్పటికి, అంటే చలం గారు వెళ్లే సమయానికి, భగవాన్ రమణ మహర్షికి కురుపు లాంటిది లేచి, ప్రాణం తీసేటంతటి అపాయంగా వుంది. రెండు, మూడుసార్లు శస్త్ర చికిత్స కూడా జరిగింది. "ఆయన తనకు తానుగా ఏదైనా మహత్యం చేసుకుంటే తప్ప, కొద్ది రోజుల్లోనే చనిపోతారు." అనే నిశ్చయం భక్తులందరిలోనూ ఉంది. అందుకనే ఎప్పటి నుండో అక్కడ వున్నవాళ్లూ, దేశ విదేశాలనుండి వచ్చిన వాళ్ళూ కూడా భగవాన్ చనిపోతే, అక్కడ్నుంచీ వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. భగవాన్ చివరి రోజు కోసం ఎదురు చూస్తున్నారు.

అలాంటి రోజుల్లో చలంగారు కుటుంబంతో సహా శాశ్వతంగా ఉండిపోవడానికి వచ్చారని తెలియగానే.. "ఏమిటి?వీళ్ళందరికీ పిచ్చి పట్టిందా?" అని చుట్టుపక్కల వాళ్ళు నవ్వడం ప్రారంభించారు. అప్పుడు చలంగారి మనస్థితి ఎలా వుందో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం... "మేం ఇక్కడ బ్రతకడానికి రాలేదుగా! మేం ఇక్కడకు చచ్చిపోవడానికే వచ్చాం. మా దగ్గర వున్నది కొంచెం ధనమే. సరే! అది కొంత కాలం వస్తుంది. తరవాత ఏం చేస్తాం? మాకే తెలీదు. నేనకున్నాను. ఏం చెయ్యం. చివరి పూట ఇన్ని బియ్యం మిగులుతాయి. మా దగ్గర ఇంకేమీ ఉండదు. ఆ బియ్యంతో ఈ పాపాయికి వండి పెడతాం. మేమంతా తిండి లేకుండా పడుకుంటాం. పడుకుని చివర వరకూన్నూ, పాపాయి ఏడవకుండా మాత్రం, ఆ బియ్యంతో అన్నం వండి పెడుతూనే ఉంటాం. మేం అందరం

చచ్చిపోయిన తరవాత, ఈ పాపాయి కూడా చచ్చిపోతుంది. అని నేను ముందరే నా భవిష్యత్తుని అంచనా వేసుకున్నాను " ఇవి చలం గారు అరుణా చలంలో దిగినప్పటి ఆలోచనలు.

అయితే, ఆయన ఊహించుకున్న అంచనా తప్పయింది. అదేమీ జరగలేదు. కానీ, రమణాశ్రమంలో చలం గారి జీవితం అంత సజావుగా సాగలేదు. మొదటి రోజు నుండి అడుగడుగునా సమస్యలే. ఎందుకంటే, ఆయనతో వున్నది వయసులో వున్న నలుగురు ఆడపిల్లలు. మరి వాళ్ళందరూ నిద్ర పోవడానికీ, స్నానాలు చేయడానికీ ప్రతి ఒక్కటీ సమస్యే. ఎంత కష్టంగా ఉండేదంటే, ఆ రోజుల్లో చలంగారు ఎదుర్కొన్న పరిస్థితుల గురించి సూర్యనారాయణ( తర్వాత రోజుల్లో 'స్వామి రామానంద 'అయ్యారు) రాసిన వాక్యాలు యధాతధంగా.... "గట్టిగా పట్టి చూస్తే ఆ ముసలి తండ్రి (అంటే చలంగారు ) ఏ నిముషాన్నయినా కళ్ళు మూయవచ్చు. అందరూ యవ్వనంలో అడుగు పెట్టిన ఆడపిల్లలు. వేరే మగ దిక్కు లేదు. చుట్టూ పురుష ప్రపంచం. ఏ నిముషాన తమ చేత చిక్కుతారా? అని పొంచి చూస్తున్నారు. ఏ అర్ధరాత్రో, అపరాత్రో ఎవరన్నా వచ్చి, తన్నినా, పొడిచి పారేసినా అడిగే దిక్కు లేదు. ఒక చిన్న అగ్గి పెట్టె కోసం ఓపికగా ఊర్లోకి రెండు మైళ్ళు నడవాలి. ఎవరికైనా జబ్బు చేస్తే, వైద్య సౌకర్యం కూడా లేదు. చేయూతకు పిలిచినా ఇరుగు, పొరుగు కూడా లేదు. చుట్టూ సమస్యలూ, చీకట్లూ. చుట్టూ భయంకరంగా నోర్లు తెరుచుకున్న తిమింగలాలతో గింగిరాలు తిరిగే సుడిగుండాల మధ్య, తుఫానుల మధ్య, సముద్రంలో పడవ ప్రయాణం. కరుణామయుడైన కర్ణధారి వున్నా తెలియని ప్రయాణం. ఇంత కష్టం ఉన్నప్పటికీ కూడా ఏ రోజు కూడా ఈ ఊర్లో మనం ఎందుకుండాలి? వెళ్ళిపోదాం అనే మాట వాళ్ళ నుండి రాలేదు. రేపు ఏమవుతుంది? అనే చింత వారికి ఏనాడూ అంకురించ లేదు. కాకపోతే మరు నిముషంలో ఏం జరుగుతుందో వారికి తెలీదు. ఆహా! ఇది సమయం అనుకోవడానికి వీలులేదు. పక్కనే విరుచుకు పడే విషాదం. ప్రమాదం. "హమ్మయ్యా !గండం గడచింది గట్టెక్కాం. ఇంకేం భయం లేదు." అనుకోవడానికి వీల్లేదు. పక్కనే పొంచి వున్న ఏ కాల సర్పమో పగడ విప్పి మీదికి వురుకుతుంది. ఏదైనా ఇది స్థిరం అనుకునేసరికి, ఆ క్షణమే కాళ్ళ కింద నేల దొలుచుపోయి, వున్న ఫలాన తలకిందులయ్యే పరిస్థితి "

ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో చలం గారి జీవితం అరుణాచలంలో ప్రారంభం అయ్యింది. మొట్టమొదటి రోజు వాళ్లకి ఎదురైన సమస్య – ఆడపిల్లలు స్నానం ఎక్కడ చెయ్యాలి? వంట ఎక్కడ చేసుకోవాలి? ఉండేదేమో పూరిపాకలో. ఆ రమణాశ్రమం దగ్గరలోనే, "బోస్ కాంపౌండ్ "అనే ఆవరణలో, ఒక బెంగాలీ ఆయన 5,6 కాటేజులు కట్టించాడు. వచ్చిన వాళ్ళు ఉండడానికీ, అద్దెకు ఇవ్వడానికి. దాన్ని 'బోస్ కాంపౌండ్ 'అనీ, 'మహాస్థాన్ ' అని కూడా అంటుండేవారు. ఆ కాంపౌండ్ లో రెండు గదులు అద్దెకు తీసుకున్నారు చలంగారు. వెళ్ళగానే డబ్బులకు ఇబ్బంది లేదు కదా! ఆ రెండు కాటేజీల్లోనే స్నానాలకీ, పడుకోవడానికి ఇలా ఏర్పాటు చేసుకున్నారు. ఆ కాంపౌండ్

లో కాటేజీల పేర్లు సర్వీస్, డిటాచ్ మెంట్, డివోషన్, సేవ,అనాసక్తి ఇలా ఉండేవి. ఆ తరవాత రోజుల్లో ఆ రెండు కాటేజ్ లను వాళ్ళ రెండో అమ్మాయి కొని పెట్టింది.

మొత్తానికి పాకలో ఉంటున్నప్పటికీ కూడా ఈ కాటేజెస్ అద్దెకు తీసుకున్నారు కనుక, ఒక విధమైన స్థాయిలో బ్రతకడానికి సాధ్యమైంది. వీళ్ళు వచ్చిన కొద్ది రోజులకే బెజవాడ నుండి రంగనాయకమ్మ గారు వచ్చేశారు. ఇలా వీళ్ళు వెళ్లిన మరో రెండు నెలలకి 1950 ఏప్రిల్ 14 రాత్రి 8. 47 నిముషాలకి భగవాన్ రమణ మహర్షి దేహాన్ని విడిచారు. ఆయన దేహాన్ని విడిచిపెట్టే సమయంలో చలంగారు ఆశ్రమంలో వరండాలో నిలుచుని ఉన్నారు. ఆయనకు ఈ సంఘటన జరగ్గానే ఆకాశంలోనుండి ఒక పెద్ద కాంతి లాంటిది వచ్చి ఆ వరండాలో పడినట్లుగా అనిపించింది. “దాన్ని నేను చూశాను.” అని కూడా రాసుకున్నారు. అయితే “భగవాన్ దేహాన్ని విడిచి వెళ్లిపోయారు. ఈ లోకంలో లేరు.” అనే భావన చలంగారికి ఏ మాత్రం దుఃఖాన్ని కలిగించలేదు.

“ఎందుకంటే – రవి చనిపోయినప్పుడు గానీ, ఒయ్యి చనిపోయినప్పుడు గానీ, వసంత్ ఇంట్లో నుండి వెళ్లపోయినప్పుడు గానీ నాకు ఏమాత్రం దుఃఖం కలగకుండా భగవాన్ చేశారు. మరి ఇప్పుడు ఆయనే వెళ్ళిపోతే, ఆ దుఃఖాన్ని ఎందుకు కలిగిస్తారు? ఆయన వెళ్లిపోయారని నాకు ఏమాత్రం దుఃఖం కలగలేదు.”అని రాసుకున్నారు చలం. అంతే కాకుండా ఆయన అనుకున్నది – భగవాన్ యొక్క దేహంతో నాకు ఎప్పుడూ ఆకర్షణ లేదు. ఏదో ఒక ప్లేన్ లో మా ఇద్దరం కలుసుకున్నాం. ఆ ప్లేన్ లోనే ఇంకా నాతోనే వున్నారు. అందుకని ఆయన లేరు అని తెలిసిన క్షణంలో కూడా ఏ మాత్రం వేదన అనిపించలేదు “ అన్నారు చలంగారు.

అయితే, ఆ తరువాత జరిగిన పరిస్థితులన్నీ చలం గారి జీవితాన్ని అక్కడ దుర్భరం చేశాయి. మరో రెండు సంవత్సరాల పాటు 1950 నుండి 52 వరకు చాలా ఇబ్బందుల్నీ, కష్టాలనీ, దుర్భరమైన సంఘటలను ఎదుర్కొన్నారు. అప్పుడు చలంగారు అనుకున్నారట “అసలు ఈ లోకంలో ఎక్కడో, ఏదో ఒక ఊరుకి వెళ్ళిపోదాం. ఆ ఊర్లో ‘చలం‘ మాట వినపడకూడదు. తెలుగు వాళ్ళు అనే మొహాలు కనపడకూడదు. అలాంటి చోటికి. ఎక్కడికన్నా వెళ్ళిపోదాం అనిపించింది కానీ, అలాంటి ఊరు ఎక్కడ దొరుకుతుంది. ఆ ఆశ్రమం లో వున్న తెలుగువాళ్లూ, అలాగే ఆశ్రమం వాళ్ళూ, వాళ్ళందరూ కలసి చలం మీద చాలా ‘స్కాండల్స్’ లేవదీశారు. వాటిని భరించలేక వెళదాం అనుకున్నా గానీ, ఎక్కడికీ వెళ్లకుండా భగవాన్ కట్టేశారు నన్ను. “ అని రాసుకున్నారు చలంగారు.

అసలేం జరిగిందంటే, భగవాన్ మరణించాక, ఆయన తమ్ముడు ఆశ్రమం యొక్క పరిపాలనా, నిర్వహణా పూర్తిగా తీసుకున్నారు. ఆయన్ని ‘సర్వాధికారి’అనీ, ‘చిన్న స్వామి’అనీ కూడా అంటుండేవారు. భగవాన్ బ్రతికి ఉండగా ఈయన మాట ఎక్కువగా చెల్లేది కాబట్టి, ఈ చిన్నస్వామి అన్నాయన, భగవాన్ పోగానే నిజంగానే సర్వాధికారాలు, ఈ సర్వాధికారివే అయ్యాయి. భగవాన్ సమాధి కట్టించాక, “ఆ సమాధి దగ్గరకు బ్రాహ్మణులు కాని

వాళ్ళు ఎవరైనా వస్తే గనక, భగవాన్ సమాధి దగ్గరకు రాకూడదు. తాకకూడదు.” అని ఒక శాసనం జారీ చేశాడు. భగవాన్ బ్రతికి వున్నప్పటి నుండి ఆయనకు సేవలు చేసిన ‘క్రిష్ణ స్వామి‘ భక్తుడు దీన్ని తీవ్రంగా ఎదుర్కోవడమే కాకుండా “ భగవాన్ బ్రతికి వున్నపుడు నేను బ్రాహ్మణుడ్ని కాకపోయినా, భగవాన్ ని తాకి సేవలు చేశాను. ఇప్పుడు మీరు రావద్దూ అంటున్నారు”అని ప్రత్యక్ష పోరాటానికి దిగాడు. చాలామంది ఇవి భరించలేక ఆశ్రమం నుండి వెళ్లిపోవడం ప్రారంభించారు. విదేశాలనుండి వచ్చే భక్తులు కూడా వెళ్లిపోవడం ప్రారంభించారు. ఈ సర్వాధికారి వాళ్ళందరి దగ్గరకూ వెళ్లి “ఎందుకు వెళ్ళిపోతారు? భగవాన్ మనతోనే ఉన్నారు. ఆయన లేరనుకోవద్దు. మనం ఎప్పటిలాగే పూజలు చేద్దాం.“ అని వాళ్లందరికీ చెప్పి, సముదాయించడానికి ప్రయత్నించాడు.

అయినా గానీ, చాలా మంది వెళ్లిపోయారు. ఒక 3,4 నెలల్లో ఆశ్రమం పూర్తిగా ఖాళీ అయిపోయిన పరిస్థితి. ఆ రోజుల్లో ఆయన “ఇక్కడ వున్న వాళ్ళందరూ సంవత్సరానికి ఒక 5 రూపాయలు ఇచ్చి, మెంబర్ షిప్ తీసుకోవాలి.” అని ఆశ్రమాన్ని ఒక క్లబ్ లాగ చేసాడు. అలాగే అక్కడ మిగిలివున్న భక్తులకీ, ఈ ‘ఆశ్రమ పరిపాలనా మండలి’ వాళ్లకీ ప్రత్యక్ష పోరాటాలు జరిగినప్పుడు పోలీసులు వచ్చారు. ఒకళ్ళని ఒకళ్ళు కొట్టుకున్నారు. కొన్నిసార్లు అగ్ని ప్రమాదాలు కూడా జరిగాయి. ఈ గొడవలు జరిగినపుడు ”మీరు సాక్ష్యం చెప్పండి” అని చలం గారిని పిలిచారు. చలంగారు అక్కడ ఉండడానికి వచ్చి నాయన. ఏం చెబుతారు? అటు వాళ్ళనీ అనలేరు. ఇటు వీళ్ళనీ అనలేరు. అలాంటి రోజుల్లో చలం గారి మీద ఈ ‘స్కాండల్స్’ లేవదీసిన తెలుగు వాళ్ళందరూ కలసి ఒక మీటింగు పెట్టుకొని “ఈ ఆశ్రమం లోకి తెలుగు వాళ్లెవరో వచ్చారు. వాళ్ళు చాలా దుర్మార్గులు. అవినీతి పరులు. ఆ ఆశ్రమం లో ఉంటే, ఆశ్రమం పేరు పోతుంది. ఇలాంటి వారిని ఉండనివ్వకుండా ఏదైనా చేద్దాం” అని తీర్మానం చేసుకున్నారు. కానీ, ఆ తరువాత వాళ్ళే, ఒక్కొక్కరూ వెళ్లిపోయారు. చలంగారు మాత్రం ఎక్కడికీ వెళ్లకుండా ఉండిపోవడానికి అవకాశం దొరికింది. ట జరిగింది, వాళ్ళ పెద్దమ్మాయి సౌరీస్ కీ, చలంగారికీ పుట్టుకతోనే ‘మైగ్రేన్’ వుంది అని గతంలోనే తెలుసుకున్నాం కదా! సౌరీస్ కి మైగ్రేన్ తగ్గడానికి ఎవరో సలహా ఇచ్చారు. “ఈ దగ్గర్లోనే పశుమాలై స్వామి అని ఒకతను ఉన్నాడు . ఆ స్వామిజీ చాలా మహత్తు గలవాడు. ఆయన దగ్గరకు వెళ్తే, మీ తలనొప్పి తగ్గుతుంది “ అని. ఆ సలహాను అనుసరించి, రమణాశ్రమానికి దగ్గర్లోనే వున్న ఆ పశుమలై స్వామి దగ్గరకు వెళ్ళింది సౌరీస్. ఆవిడకు ఏదో తలనొప్పి కొంచెం తగ్గినట్లనిపించింది. అదే విషయాన్ని తల్లితోటీ, తన వెంట వున్న చిత్ర తోటీ చెప్పి, వాళ్ళందరినీ కూడా ఆ స్వామి దగ్గరకు తీసుకువెళ్ళింది. ఇదంతా భగవాన్ చనిపోక ముందే జరిగింది. అందుకనే భగవాన్ చనిపోయిన రోజున సౌరీస్ గానీ, రంగనాయకమ్మ గారు గానీ ఆశ్రమంలో లేరు.

ఒక రోజు చిత్ర పాపని వెంటబెట్టుకొని ఆ పశుమలై స్వామి దగ్గరకు వెళ్ళినపుడు, అక్కడ ఆ చిన్న పాపకు జ్వరం వచ్చిందనీ, విరోచనాలు యేవో అవుతున్నాయని చలంగారికి ఎవరో కబురు చేశారు. సరే! ఆ పాపను

తీసుకువద్దామని చలంగారు గబగబా ఆ పశుమలై స్వామి ఆశ్రమానికి వెళ్లారు. అదే మొట్టమొదటి సారి అతన్ని చూడడం. అక్కడ కొన్ని రోజులు ఉన్నారు. అక్కడ వున్నప్పుడు ఆయనకు తెలిసింది – ఈ పశుమలై స్వామి అందరూ అనుకున్నట్లు నిజమైన స్వామిజీ  కాదు. ఆయన తాను సంపాదించిన ధనం, పలుకుబడి తోటి, ఆడవాళ్ళని లోబరచుకోవడానికీ, అలాగే ధనం సంపాదించడానికీ ఉపయోగిస్తున్నాడు– అని. ఆ విషయం చలం గారికి రూఢిగా తెలిశాక  ఆ ఆశ్రమం లో వున్నా వాళ్లకు చెప్పారు.

అది తెలిసిన ఆ పశుమలై స్వామి  చలం గారిని బెదిరించాడు. “చూడు మిమ్మల్ని ఏం చేస్తానో, అసలు ఈ అరుణాచలం లోనే లేకుండా చేస్తాను”  అంటూ శాపనార్థాలు పెట్టాడు.  ఆయన ఆశ్రమం నుంచి,  చలంగారు కుటుంబ సభ్యులను వెంటబెట్టుకొని అరుణాచలానికి తిరిగి వచ్చేశారు. ఇదంతా భగవాన్ చనిపోయిన 3,4 నెలల్లో జరిగింది.

ఆ సంఘటన జరిగిన దగ్గర్నుంచి,  పశుమలై స్వామి చలంగారిని  బెదిరించడం ప్రారంభించాడు. “మీరు అరుణాచలం వదలి వెళ్తారా,లేదా?” అని దొంగతనంగా ఉత్తరాలు రాయడం.. అలాగే ఎవరినైనా పంపించి బెదిరించడం. కొన్నిసార్లు ఆయనే వచ్చి, “మీతో మంచిగా ఉంటాను. మనం అందరం కలసి ఉందాం. “అని చెప్పి వెళ్లి, మళ్ళీ బెదిరింపు ఉత్తరాలు రాయడం .. ఇలా జరిగింది. అప్పటి పరిస్థితులను తన మిత్రుడు చింతా దీక్షితులు గారికి ఉత్తరాల్లో ఇలా రాసుకున్నారు “ ఈ పశుమలై స్వామి చాలా గొప్ప వాడన్నా కావాలి. చాలా అపాయకరమైన వాడన్నా కావాలి. నన్ను “పశువు, అడవిలో ముళ్ల చెట్టై జన్మించాలి.” అని శపించాడు. ఇంకా నన్ను వదల్లేదు. వెంబడిస్తున్నాడు. నన్ను నాశనం చేయడానికా?ఉద్ధరించడానికా? ఏం చేయాలో భగవాన్ చేయలేకపోయినారా ? వీడికెందుకు? ఈ వాతావరణం అంతా దుష్ట మంత్ర శక్తితో నిండి ఉంది. నేను బెజవాడ వదలి యోగులతో, రాక్షసులతో కలత పెట్టే ఈ దేశానికీ ఎందుకొచ్చానా?అని ఏడ్చాను” అని .

అయితే, దేనికీ కూడా చలంగారు బెదరకుండా అక్కడే  ఉండడంతో, ఇంక ఏమీ చేయలేక తన ఆశ్రమం లోనే ఉండి పోయాడు ఆ పశుమలై స్వామి.  చలంగారి అరుణాచలం వెళ్ళిన కొత్తలో ఇలాంటి సంఘటనలి ఒక కోణమైతే –  మరో కోణం నిత్య జీవితం లోని ఇబ్బందులు. ఆయన వెళ్లిన సంవత్సరమే నీళ్ల కరువు వచ్చింది. అలాగే వీళ్ళు బెజవాడలో తిన్న బియ్యం, ఇక్కడ దొరికేవి కావు. జొన్నలూ, కొత్త బియ్యమూ ఉండేవి. అలాంటివి వీళ్ళకి వండడం అలవాటు లేదు. చలం గారికి ‘మైగ్రేన్’ ఎలాగూ కొనసాగేది.  ఆ మైగ్రేన్ ని అదుపులో ఉంచుకోవడానికి  మాంసం తింటుండేవారు. ఆ అలవాటు  బెజవాడలో ఉన్నప్పుడే ఉంది. మరి ఇక్కడ మాంసం తినడానికి రంగనాయకమ్మ గారు ఒప్పుకునేవారు కాదు. అందుకని ఆమెకు తెలియకుండా ఊర్లోకి వెళ్లి , ఏదో మహ్మదీయుల హోటల్ నుండి కొంచెం మాంసం తెచ్చుకొని, రంగనాయకమ్మ గారికి కనపడకుండా దాచుకొని, వంకాయ కూరతో కలిపి

తింటుండేవారు. వాసన వచ్చినపుడు రంగనాయకమ్మగారు తిడుతుండేవారు.  ఇవి మొట్టమొదటి సంవత్సరంలోని సంఘటనలు.

'చాలా సార్లు బెజవాడ వదిలేసి ఎందుకు వచ్చాను. అక్కడ ఉంటే, యేవో పత్రికలకు రాసుకుంటే, పదో, పరకో వచ్చేది కదా! ఇక్కడ ఇన్ని కష్టాలు పడుతున్నాను. అని తాత్కాలికంగా అనిపించేది కానీ, అన్ని భగవాన్ చూసుకుంటారు. భగవాన్ మీద భారం వేసి వచ్చాం కదా!కాబట్టి, ఇంతకు మించి ఏ ఊరు వెళతాం.' అనుకొని అక్కడే కొనసాగారు.  1951 వ సంవత్సరం వచ్చేసరికి ఆశ్రమం లోని పాలక వర్గం చలం గారిని పూర్తిగా శత్రువుల జాబితాలో వేసేశారు. భక్తులు మాత్రం చలంగారంటే బాగానే ఉండేవారు. అప్పటి నుండీ, చలంగారి చిట్టచివరి వరకూ కూడా అక్కడ వున్నన్ని రోజులూ ఆశ్రమ పాలక వర్గానికీ, చలం గారికీ ఎప్పుడూ బద్ధ వ్యతిరేకంగానే ఉండేది. అయితే, చలం గారికి తన పరివారం, వచ్చిన వాళ్ళు మరికొంత మంది ఉండడంతో, యెంత వైరం వున్నా, ఇబ్బందులు ఎదురైనా అక్కడే నివసించగలిగారు.  భగవాన్ సమాధి దగ్గర కూర్చోవడం. గంటల తరబడి ధ్యానం చేసుకోవడం, ప్రార్ధనలు చేయడం లాంటివి కొనసాగించారు.

1951 వ సంవత్సరం. అప్పటికి చలంగారు వచ్చి సంవత్సర కాలం అయింది. అప్పటి వరకూ వాళ్ళు తెచ్చుకున్న డబ్బులేవో వాడుకుంటున్నారు. అవి కూడా అయిపోవస్తున్నాయి. అప్పటికి చలం గారితో వున్న అమ్మాయిలు పకపకా, చిత్రా "మద్రాస్ వెళ్లి, సినిమాల్లో ఏదైనా పని చూసుకుంటాము." అని వెళ్లారు. అప్పటికి నిర్మల మద్రాస్ లోనే ఉంది. ఏదైనా వుద్యోగం కోసమో, వేషాల కోసమో, సాంకేతికమైన పనుల కోసమో ఇతమిత్థంగా తెలియదు కానీ, ఈ విషయాన్ని మిత్రులకు రాసిన ఉత్తరాల్లో రాసుకున్నారు.

అప్పటికి  చలంగారి తమ్ముడు కొమ్మూరి వెంకటరామయ్య గారు మద్రాస్ లోనే ఉన్నారు. అతని భార్య కొమ్మూరి పద్మావతిదేవి గారికీ, వాళ్ళ అబ్బాయి కొమ్మూరి సాంబశివరావు గారికీ కూడా సినిమావాళ్లతో పరిచయాలున్నాయి. మరి వాళ్ళ సహాయం తీసుకున్నారో, లేదో తెలియదు గానీ, మొత్తానికి 2,3 వారాలు మద్రాస్ లో ఉండి వెనక్కి వచ్చేసారు.

అదే రోజుల్లో చలం గారికి ఒక చక్కని ప్రతిపాదన వచ్చింది. అక్కడకు దగ్గరగా వున్నా వాళ్ళు ఎవరో వచ్చి, "మీరు ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నారు. ఈ గడ్డం బాగా పెరిగి స్వామిజీ లాగ ఉన్నారు. ఇక్కడ చిత్రావతి నది ఒడ్డున ఒక పర్ణశాల ఉంది . మీరు వచ్చి అక్కడ కూర్చోండి. మిగతా పనులన్నీ మేం చూసుకుంటాం. అందరికీ మిమ్మల్ని స్వామీజీగా పరిచయం చేస్తాం. ఇలా చేస్తే గనక మీ జీవితం సజావుగా సాగిపోతుంది. మాకూ వ్యాపారం జరుగుతుంది. " అని.. అయితే చలంగారు అలాంటి వాటికి లొంగే మనిషి కాదు కదా! ఆ ప్రతిపాదనని తిరస్కరించారు.

1951 జూలై వచ్చింది. ఆనాటికి చలంగారు అరుణాచలం వచ్చి సంవత్సరంన్నర అవుతున్నది. డబ్బులు దాదాపుగా అయిపోవచ్చాయి. ఆ సమయంలో బెజవాడ, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాల వాళ్ళూ ఉత్తరాలు రాశారు. "మీరు ఏవైనా నాటకాలు రాసి పంపించండి. మీకు డబ్బులు పంపిస్తాం " అని. కానీ, అప్పటికి నాటకాలు రాసే పరిస్థితి లేదు. యెంత సేపూ, భగవాన్ ధ్యానం. భగవాన్ సమాధి దగ్గర కూర్చోవడం, మధ్యమధ్యలో వచ్చే ఇబ్బందుల్ని పరిష్కరించు కోవడం – అలా కొనసాగుతోంది. అయితే, మద్రాస్ నుండి ఆయనకు ఒక కబురు వచ్చింది. ఎవరో నిర్మాత "నేను 'అనార్కలి' అనే సినిమా తీస్తున్నాను. దానికి మాటలు రాయాడనికి రండి "అని. చలం గారికి నిజంగా అలాంటి వాటికి వెళ్లడం ఇష్టం లేదు. కాకపోతే అప్పుడున్న పరిస్థితుల్లో డబ్బులు అవసరం కాబట్టి మద్రాసు వెళ్ళారు.

ఆయన్ని ఏదో హోటల్ లో పెట్టారు. అక్కడ చిన్నప్పటి నుండి కాకినాడలో కలసి పెరిగిన క్రిష్ణ శాస్త్రి గారు కూడా కనిపించారు. అదే రోజుల్లో క్రిష్ణ శాస్త్రి గారు కూడా 'మల్లీశ్వరి' సినిమాకి పాటలు రాయడానికి మద్రాస్ లో వున్నారు. ఆయన గురించి చలంగారి మిత్రులకు "క్రిష్ణ శాస్త్రి కనిపించాడు. చక్కగా ఆరోగ్యంగా ఉన్నాడు. వాళ్ళే తెలివైన వాళ్ళు. నాలాంటి వాళ్ళు అమాయకులుగా ఉండిపోయారు "అని రాశారు. నిర్మాత చలంగారికి అనార్కలి కథ చెప్పి, "ఇదండీ కథ రాయండి" అన్నాడు . "ఇదేమిటి? కథ మీరే చెప్పేశారు. ఇక నేను రాసేదేముంది?"అన్నారీయన. "అలా కాదండీ. నేను పైపైన చెప్పాను. మీరు సినిమాకి సరిపడా దృశ్యాలు ప్రకారం రాయాలి "అన్నారు. సరేనని, ఆయనకీ తోచినదేదో రాశారు.

కానీ, చలం గారికి మనసు అక్కడ లేదు. 'ఎప్పుడు అరుణాచలం వెళ్లిపోదామా?భగవాన్ సమాధి దగ్గర కూర్చుని ప్రార్ధన చేసుకుందామా 'అని ఉంది . ఒక వర్షన్ రాశాక, నిర్మాత, దర్శకుడూ వచ్చి, "ఇలా కాదండీ, దీన్ని మళ్ళీ మార్చి రాయండి"అన్నారు. మళ్ళీ మార్చి రాశారు. "ఇంకా అక్కడ మార్చాలీ, ఇక్కడ మార్చాలీ" అన్నారు.

"ఇదేమిటీ? మీరు నాకు చెబుతుంటే, నేను రాయడం ఏమిటి? అదేదో మీరే రాసుకోండి." అని మూడు నాలుగు వారాల్లో వెనక్కి వచ్చేశారు. 1951 ఆగస్టు వచ్చింది. పని పూర్తికాలేదు కాబట్టి మద్రసు నిర్మాతా డబ్బులు పంపలేదు. ఐనా చలంగారికి – రేపు ఏమవుతుందీ? వచ్చే సంవత్సరం ఏం అవుతుందీ?ఎలా జరుగుతుంది?అనే ఆలోచనే లేదు. ఎప్పుడూ "భగవానే చూసుకుంటారు. ఆయనే త్రోవ చూపిస్తారు." అనే భరోసాతోనే ఉండేవారు. 1951 ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం రోజున, చలం గారి భార్య రంగనాయకమ్మగారు ఆ కాటేజ్ అంతా కడిగి, ముగ్గులు వేసి, జాతీయ జెండా పెట్టారు. ఆవిడ యేవో ప్రార్ధనలు లాంటివి చేస్తున్నారు.

సరిగ్గా ఆ క్షణంలో జరిగిన ఒక అద్భుతమైన సంఘటన ఏమిటంటే.. . సౌరీస్ గారు అరుణాచలం వెళ్లిన దగ్గర నుండి ధ్యానం లోనే ఉండేవారు. ఒక్కోసారి ఒళ్ళు తెలియకుండా ఉదయం నుండి సాయంత్రం వరకూ ఒక

రూమ్ లోనే ఉండిపోయేవారు. బయటకు వచ్చేవారు కాదు. అలా ఆ ఆగస్టు 15 వ తేదీన , ఆమె ధ్యానం లో ఉండగా, ఆమె ఒక విచిత్రమైన అనుభూతికి లోనయ్యారు. ఏదో ఒక దివ్య శక్తి, తనని ఆవహించినట్లు, తనలో చేరుతున్నట్లుగా ఆమెకు ఒక అనుభూతి కలిగింది. ఆ వచ్చిన శక్తి "ఈశ్వరుడు"అని ఆమె నమ్మారు. నమ్మడమే కాకుండా, తనలో తాను ఈశ్వరుడి తో మాట్లాడినట్లుగా కూడా ఆమె భావించారు. ఆమెకు ఒళ్ళంతా చెమటలు పట్టడం, బాగా వేడి వచ్చేసినట్లుగా అవ్వడం, వణుకు రావడం ఇలాంటివి కూడా సంభవించాయి.

ఆవిడ చాలా సార్లు అనుకున్నారట, ఆ వచ్చినటు శక్తి తనతో మాట్లాడినట్లుగా,

"ఎవరు మీరు?"

"నేను ఈశ్వరుడ్ని"

"ఎందుకు మీరు వచ్చారు ?"

"నేను మీ జీవితాన్ని నడిపించబోతున్నాను. నిన్నూ, నీ తండ్రినీ, నీ చుట్టు పక్కల వున్న వాళ్ళనీ కూడా నేను నడిపిస్తాను" అని . ఈశ్వరుడు అంటే, మనం అనుకునే 'శివుడు' లాంటి భావన కాదు. భగవాన్ కి మరో రూపం అని గానీ, భగవాన్ అని గానీ అనుకున్నారు గానీ, 'ఈశ్వరుడు' అనే భావిస్తూ ఉండేవారు. ఇలాంటివన్నీ ఆవిడ తనలో తాను ఆ దివ్యశక్తి తో మాట్లాడినట్లుగా అనుకొని, అనుభూతికి లోనై, ఆ శరీరంలో కలిగిన మార్పులూ, చెమటలు పట్టినటు వంటి తో బయటకు వచ్చి, తల్లికీ, తండ్రికీ చెప్పారు "నాకు ఈశ్వరుడు కనిపించాడు. ఇక నుండి ఈశ్వరుడే మనల్ని నడిపిస్తాడు. "అని. దానికి చలంగారు అన్నారట "నువ్వు ఎప్పుడూ ఇలాగే చెబుతుంటావు. నీకు అప్పుడప్పుడు రవీంద్రనాథ్ ఠాగూర్ కనిపించాడనీ, లేకపోతే ఇంద్రుడూ, మునులూ కనిపించారనీ! ఇప్పుడు ఈశ్వరుడు కనిపించాడని అంటున్నావు." అని. సౌరీస్ గారేమో.. "లేదు. నాకు నిజంగానే ఈశ్వరుడు కనిపించి, మన ఇంట్లోని పరిస్థితిని తెలిసినట్లుగా నిన్ను సరిచేయమని నాతో చెప్పినట్లుగా చెప్పార"ని తండ్రిని ఒప్పించింది.

చలంగారు చాలా సేపు వాదించాక, "సరే!అయితే, ఏం చేస్తావు? ఏం అంటాడు మీ ఈశ్వరుడు. అతను చెప్పినట్లు వింటే, నా జీవితం మారిపోతుందని అంటున్నాడా ? నువ్వు చెప్పినట్టు వింటే, నా తలనొప్పి తగ్గిపోతుందా అంటున్నాడా ?". ఇలా యేవో వాదనలు చేశారు. చిట్ట చివరికి సౌరీస్ నమ్మకానికి ఆయనకూడా లొంగిపోయారు. ఆ క్షణం నుండి సౌరీస్కి ఈశ్వరదర్శనం అయిందనీ, అప్పటి నుండి సౌరీస్ మాట్లాడిన మాటలన్నీ సౌరీస్ కాదు. ఈశ్వరుడే మాట్లాడిస్తున్నాడనీ, చలం గారూ, అతని కుటుంబ సభ్యులూ నమ్మారు. సౌరీస్ ని ఏది అడిగినా "ఈశ్వరుడ్ని అడిగి చెబుతాను "అనే వారు. కొన్ని రోజుల తర్వాత ఆమె ఏం మాట్లాడినా "ఈశ్వరుడే మాట్లాడుతున్నాడు"అని చలం గారూ, అతని కుటుంబ సభ్యులూ అనేవారు. క్రమంగా చలంగారి అభిమానులు కూడా సౌరీస్ ని ఈశ్వరుడు అనే నమ్మేవాళ్ళు.

ఆ తరువాత దాదాపు 28 సంవత్సరాల పాటు చలం గారు జీవించినంత కాలమూ, ఆ తరువాత సౌరీస్ జీవించినంత కాలమూ కూడా, ఆశ్రమం లోని వాళ్ళూ, చలం గారి అభిమానులు కూడా సౌరీస్ ని 'దైవాంశ సంభూతురాలు'గానూ, అలాగే ఈశ్వర దర్శనం కలిగిన ఒక మహా వ్యక్తిగానూ భావించారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం ఆగస్టు 15 వ తేదీన 'ఈశ్వర దర్శనం' కలిగిన రోజుని జరుపుకొంటారు. ఆ సాంప్రదాయాన్ని భీముని పట్నంలోని "స్నేహ కుటీర్" లో ఆశ్రమం లో పాటిస్తున్నారు. ఆ రోజు నుంచి చలం గారు రాసిన ఏ రచన లోనైనా 'ఈశ్వరుడు'అని రాశారంటే, అది సౌరీస్ అని మనం అర్థం చేసుకోవాలి.

. వాళ్లకి యేవో కొన్ని మహాత్యాలు కూడా కనిపించాయట. – వీళ్ళు ఉండేది రమణాశ్రమం పరిసరాల్లో. ఊరు అక్కడకి 2,3 మైళ్ళు దూరంలో ఉంటుంది. చలం గారు ఒకసారి ఊర్లోకి వెళ్లి వస్తుంటే, త్రోవలో చలం గారికి పాము కరిచింది. ఆయన మందులు వేసుకోలేదు. రెండు, మూడు రోజుల తర్వాత తగ్గిపోయింది. ఇంకోసారి ఏదో పిచ్చి కుక్క కరిచింది. ఊర్లోకి వెళ్తే, ఏ డాక్టరూ మందివ్వలేదు. అయినా గానీ, రెండు, మూడు రోజుల్లో తగ్గిపోయింది. "ఇవన్నీ కూడా ఈశ్వరుడు చేస్తున్న మహత్యాలు."అనుకునేవారు.

ఎంతగా ఈశ్వరుడ్ని నమ్మేవారంటే, ఒక్కోసారి "ఈశ్వరుడూ! చెప్పండి రేపు ఎండ వస్తుందా? మేం బట్టలు ఆరేసుకోవాలి. " అని అడిగేవారు. "వాటికి ఈశ్వరుడు సమాధానం చెప్పారు" అనుకునేవారు. ఇలా చలం గారి జీవితంలో మరొక విధమైన దశ ప్రారంభమయ్యిందనుకోవచ్చు.

ఇక్కడ నుండి మరొక 10 సంవత్సరాల వరకూ చలం గారి జీవితంలో జరిగిన ముఖ్యమైన విశేషాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

చలంగారు అరుణాచలంలో ఉన్న మొత్తం 29 సంవత్సరాల్లో ఆయన ఎక్కడికీ వెళ్ళలేదు. ఎక్కువగా పరిచయాలూ జరగలేదు. అందువల్ల గతంలో జరిగిన సంఘటనలూ, మలుపులూ, సందర్భాలూ, సన్నివేశాలూ అలాంటివి ఏవీ ఈ అరుణా చలంలో ఉండవు. ఆ పది సంవత్సరాల విశేషాలనూ వివిధ విభాగాలుగా వ్రాస్తాను.

*ముందుగా చలంగారి ఉత్తరాలు*

చలంగారు అరుణాచలం వెళ్ళిపోయారని తెలిశాక, ఆయనకు బాగా సన్నిహితులైన మిత్రులు, ఆంధ్రదేశం నుండి ఉత్తరాలు రాస్తూండేవారు. చలంగారికి కూడా ఉత్తరాలు రాయడం అనే అలవాటు చిన్నప్పటి నుండి అంటే 1920 లో ఆయన సాహిత్యం ప్రారంభించిన దగ్గర నుండి కూడా వుంది.

ఆయన ఉత్తరాలని కూడా 'ఉత్తమ సాహిత్యం' గా పరిగణిస్తుంటారు. పరిగణించడమే కాదు. నిజంగా మనం చదువుతుంటే, అద్భుతమైన సాహిత్యం కనిపిస్తుంది. అద్భుతమైన భాషా, శైలీ, అలాగే చలం గారి జీవితంలోని ముఖ్యమైన మలుపులూ కనిపిస్తుంటాయి. చాలా మంది కొత్త వాళ్ళు – వాళ్లకు ఏవైనా సమస్యలు వస్తే, "వీటికి

పరిష్కారాలు చెప్పండి”అనే వారు. పాతవాళ్ళకైతే, ఆశ్రమంలో జరుగుతున్న విశేషాలన్నీ పూసగుచ్చినట్లు వ్రాస్తుండే వారు చలంగారు. అందులో చెప్పుకోదగ్గ మిత్రుడు ‘చింతా దీక్షితులు’ గారు. ఆయన చలంగారిని 1936లో అరుణాచలానిక్ తీసుకొచ్చారు కదా. ఆయన అప్పుడప్పుడూ రమణాశ్రమానికి వచ్చి వెళుతున్నారు. గానీ, అక్కడే స్థిర పడలేదు. ఆయనా చలం గారికి ఉత్తరాలు రాస్తూండేవారు. చలంగారు కూడా జవాబులు రాస్తూండేవారు. చింతా దీక్షితులు గారికీ, చలంగారు ఉత్తరాలు రాయడం అనేది 1927 నుండే ప్రారంభమయ్యింది. చలంగారు ఇంకా అరుణా చలం రాకముందే చింతా దీక్షితులుగారు చలంగారు రాసిన ఉత్తరాలన్నీ కూడా ఒక పుస్తకం లాగ ప్రచురిద్దామనే ఆలోచన చేశారు. తరువాత రోజుల్లో ప్రచురించారు కూడా.

చింతా దీక్షితులు గారితో పాటు, ఎస్. వీరేశలింగం అని ఆయన కొత్తగా ఉత్తరాలు రాయడం ప్రారంభించాడు. ఆయనది శ్రీకాకుళంగానీ, విశాఖపట్నం గానీ ఐ ఉండాల. చలం గారు ఆయనకీ చాలా ఉత్తరాలు రాశారు. జగ్గారావు, చిన్నారావు, జరుక్ శాస్త్రి, పురంగేశ్వరావు, గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారికి – ఇలా చాలా మందికి రాశారు. వీళ్ళంతా చలంగారు తమకు రాసిన ఉత్తరాల్ని, పుస్తకాలుగా ప్రచురించారు. చలంగారి ఉత్తరాలమీద పరిశోధనా గ్రంధాలు రాసి, వాటిమీద పి.హెచ్.డిలు తీసుకున్న వాళ్ళు కూడా ఉన్నారు. ఆ ఉత్తరాలు చదువుతుంటే ఒక పెద్ద నవల చదువుతున్నట్టుగా ఉంటుంది. చలంగారి జీవితంలోని మలుపులన్నీ తెలుస్తూ ఉంటాయి.

***చలంగారి కోసం అరుణాచలం వచ్చినవాళ్ళు:***

చలం గారిని చూడాడనికి చాలా మంది అరుణాచలానికి వస్తుండేవారు. ఒక్క ఆంధ్రదేశం నుండే కాకుండా, భారతదేశంలోని వివిధ ప్రదేశాలనుండి కూడా వచ్చేవారు. చాలామంది అపరిచితులుకూడా ఈయనకు ఉత్తరాలు రాసి, “మా ఇంట్లో సమస్య వుంది “ – ”నాకు వివాహం కాలేదు లేదా వివాహం అయినా ఏదో సమస్య వుంది “ ” నా కూతురో, కొడుకో చనిపోయారు చాలా విషాదం లో వున్నాను” అని చెప్పుకూంటూ ఉండేవాళ్ళు. చలంగారు సమాధానమిస్తూ – “మీరు రాదలచుకుంటే రండి. ఈశ్వరుడు ఉన్నాడు. మీకు సహాయం చేయగలడు. కాకపోతే, వచ్చాక మీరు తీవ్రమైన సాధన చెయ్యాలి. ఆ సాధనలో మీరు ఉండగలిగితే రండి “ అని రాస్తూండేవారు.

కొంత మంది నిజంగానే అరుణాచలం వచ్చేవాళ్ళు. చలం గారి దగ్గర వుండేవాళ్ళు. కొంత మంది కొన్నాళ్ళు ఉన్నాక, ఉండలేక వెళ్లిపోయేవాళ్లు. “ఇదేమిటి ?మీరు ఈశ్వరుడు అన్నారు. ఇక్కడ సౌరీస్ చెబుతున్నారు.”అనే వాళ్ళూ వున్నారు. అలా కాకుండా అక్కడ స్థిర పడిపోయే వాళ్ళూ వున్నారు. ఎవరు వచ్చినా చలంగారు గానీ, ఆయన కుటుంబసభ్యులు గానీ, “ఇక్కడ మీకు చోటు లేదు. మీరు వెళ్లిపోండి “ అని గానీ, “భోజనానికి ఇబ్బంది” అని గానీ చెప్పేవారు కాదు. వచ్చిన వాళ్ళు మగవాళ్ళైతే పక్కనే ఒక కాటేజ్ తీసుకొని వుండేవాళ్ళు. మరి ఎక్కడ నుండి వచ్చేదో, ఎలా పెట్టేవారో గానీ, అందరికీ రాగానే ముందుగా “భోజనం చేశారా?” అని అడగడం,

వున్నవాళ్ళతో పాటుగా భోజనం పెట్టడం చేసేవారు. మీరెవరు? ఎందుకు వచ్చారు? అనేవి తరవాత కనుక్కునేవారు. ఆ రోజుల్లో అలా దర్శనం చేసుకొన్న వాళ్లలో, అక్కడ వుండిపోయిన వాళ్లలో 17 ఏళ్ళ వయసు నుండి 70 ఏళ్ళ వృద్ధుల వరకూ వున్నారు.

అలా వెళ్లిన వాళ్లలో చాలా ఆసక్తికరమైన వ్యక్తులు ఇద్దరు. ఒకరు ఘంటసాల వెంకటేశ్వరావు గారు. ఆయన అప్పుడపుడే సినీరంగంలో పైకి వస్తున్నారు. ఆయన చలం గారి ఆశ్రమం లో రెండు రోజులు వున్నారు. దాన్ని ఆశ్రమం అంటుండేవారు. అక్కడ ప్రార్ధనలు చేస్తూ ఉంటే, ఘంటసాల గారు కూడా ప్రార్ధనలు చేశారట. అలాగే ఘంటసాల గారి సహాయకుడు సంగీతరావుగారు కూడా పలుమార్లు చలం గారి దగ్గరకు వెళ్లి వస్తుండేవాడు. అలాగే చలం గారి దగ్గరకు వెళ్లే ప్రముఖుల్లో మరొకరు 'గోపరాజు రామచంద్రరావు'. ఆయనకు విజయవాడ లో 'నాస్తిక కేంద్రం' ఉండేది. అలాగే రాజకీయనయకుడు గొట్టిపాటి బ్రహ్మయ్య గారు కూడా.

అక్కడే ఉండిపోయిన వాళ్లలో ఒకాయన బసవరాజు గారు. ఏలూరులో చలం గారు పనిచేసినప్పుడు ఆ స్కూల్ లో అసిస్టెంట్ గా ఉండేవాడు బసవరాజు. ఆయన చలం గారి ఆశ్రమంలో, తోట పనుల్లాంటివి చేస్తుండేవాడు. అలాగే 'చిక్కాల క్రిష్ణారావు అని ఇంకొకాయన. 'చాడ్విక్ 'అని ఒక యూరోపియన్ ఉండేవాడు. ఆయన చలం గారు అక్కడకు వెళ్లక ముందు నుండి అక్కడే ఉండేవాడు. ఈ చాడ్విక్ ,చలంగారు, అరుణాచలం వచ్చాక, ఆయనకు బాగా సన్నిహితుడయ్యాడు. చాడ్విక్ చనిపోయేవరకూ చలంగారితో ఉంటూ, చలంగారితో పాటుగా ప్రార్ధనలు చేస్తుండేవాడు.

***అరుణాచలంలో చలంగారి రచనలు:***

ఈ 10 సంవత్సరాలలో చలం గారిలో తెలుసుకోవల్సిన మరో కోణం – అయన చేసిన రచనలు. మొదట్లో ఈశ్వర దర్శనం జరగడం, ప్రార్ధనలు చేసుకోవడం, సాధనలో ఉండడం, మైగ్రేన్ తగ్గించుకోవడం.. వీటిల్లో ఉండి ఎక్కువగా రాయలేదు గానీ, ఐదారు సంవత్సరాల తర్వాత మళ్ళీ రాయడం ప్రారంభించారు. ఠాగూర్ రాసిన గీతాంజలిని 1958 లో ఒక నెల రోజుల్లోనే సరళమైన తెలుగులోకి అనువాదం చేశారు. అలాగే భగవాన్ చెప్పారని జీసస్ జీవితాన్ని సురీస్ తెలుగులో రాయడం ప్రారంభించారు. అయితే జీసస్ సువార్తలు వాటినన్నిటినీ "శుభ వార్తలు " అనే పేరుతో చలంగారు సరళమైన తెలుగులో రాశారు. అవి రాసేటప్పుడు చాలా మంది క్రైస్తవులు అన్నారట "మీరు రాముడు గురించీ, కృష్ణుడు గురించి రాసుకోక మా దేవుడి గురించి ఎందుకు రాస్తారు?"అని.

చలంగారికి అలాంటివి భేదాలేవీ లేఇ కాబట్టీ, ఆయన శుభవార్తలే కాకుండా "మార్తా "అనే ఇంకో నవల కూడా రాశారు, ఏస్తు క్రీస్తు జీవితం ఆధారంగా. ఆ నవల రాసాక ఎవరైతే వ్యతిరేకించారో, ఆ క్రైస్తవ పెద్దలే వచ్చి చలం గారికి దణ్ణం పెట్టి "చాలా బాగా రాశారు. జీసస్ జీవితాన్ని మేం కూడా ఈ కోణంలో చూడలేదు. మీరు అనుమతి ఇస్తే, దీని ఆధారంగా మేం ఒక ఫిల్మ్ లాగ తీసి అన్ని చోట్లకూ తీసుకువెళతాం"అని కూడా అన్నారట. ఇవి చలంగారు రాసిన కొద్ది రచనలు.

మరీ ఆంధ్రదేశం వదలక ముందు వ్రాసినంత ఉధృతంగా వ్రాయక పోయినా, రచనా వ్యాసాంగం అనేది మాత్రం కొనసాగించారు. 1957 వచ్చేసరికి "మీ జీవిత చరిత్ర రాస్తాను " అని ఒక పెద్దాయన ఆయన దగ్గర కూర్చున్నాడు.

ఆయన ఎవరు? అదెలా జరిగింది అనే విశేషాలు వచ్చేసంచికలో..

★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఏప్రిల్ 16 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS